


# స్థలమహాత్మ్యం

అయ్యగారి శ్రీనివాసరావు

చలపతి మాంచి హుషారుగా పని చేసుకుపోతున్నాడు. అతడిముందున్న ఉత్తరాలనన్నింటినీ చకచకా 'సార్టింగ్' చేసేస్తున్నాడు. ఏవీధి ఉత్తరాలు ఆవీధి వారీగా, తరువాత యిళ్ళవారీగా పేర్చుతున్నాడు. ఒకరింటి తరువాత మరొకరింటివిగా పేర్చుకుంటూ పోతున్నాడు. చక్కగా పనిచేసుకునిపోయే వాడిని 'సవ్యసాచి' అని ఎందుకు పిలుస్తారోనని జుట్టుపీక్కుని ఆలోచించే వారికి చలపతిని చూస్తే సమాధానం దొరుకుతుంది. అదేమంటే 'సవ్యంగా సాచుకుంటూ (పేర్చుకుంటూ) పోయేవాడు కాబట్టి ఆ పేరు వచ్చింది' అని.

అతడు ఇప్పుడే కాదు. ఎప్పుడూ స్పీడువర్కరే. దానికితోడు అతడి స్పీడుని పెంచే ఆనందకర విషయం అతడి మదిలో కదలాడుతోంది. దాని ప్రభావంతో అతడి మనసు ఆనందతాండవం చేస్తోంది. ఆ ఆనందంతోనే తన పని ముగించుకుని కట్టిన ఉత్తరాల కట్టల్ని సంచిలో సర్దుకుని బయలు దేరడానికి సిద్ధమయ్యాడు. అది చూసిన అతడి తోటి పోస్టుమేన్ సుందరం చలపతితో అన్నాడు.

'ఏంటోయ్ చలపతీ! అప్పుడే సార్టింగ్ అయిపోయిందా? నేను రెండు సంవత్సరాలనుంచీ ఈ బీటులో వున్నా ఎవరిళ్ళు ఎక్కడున్నాయో ఇప్పటికీ పూర్తిగా తెలీక ఛస్తున్నాను. అలాటిది నువ్వీ వూర్లో జాయినయి నెల్లాళ్ళు కాలేదు. అప్పుడే ఇంత ఫాస్టా!' అడిగాడు క్వశ్చన్ మార్కులా మోహంపెట్టి.

ఆ మాట విన్న మరో పోస్టుమేన్ శంకర్రావు సుందరంతో 'మన చలపతి గురించి నన్నడుగు. నేను చెబుతాను' అన్నాడు.

'అతడికి అసిస్టెంట్‌గా ఎప్పుడు చేరావ్?' అడిగాడు సుందరం నవ్వుతూనే.

ఆమాట విన్న శంకర్రావు 'అదికాదురా బాబూ. నేను చెప్పేది అడ్డుపుల్లలు వెయ్యకుండా సావధానంగా వింటావా?' అన్నాడు కాస్త విసుగ్గా ముఖం పెట్టి.

ఆ మాటవిన్న సుందరం 'చెప్పు' అన్నాడు బుద్ధిమంతుడిలా ఫోజిచ్చి.

శంకర్రావు చెప్పడం మొదలుపెట్టాడు. 'ఈ చలపతీ, నేనూ విజయనగరంలో కలిసి పనిచేశాం. అక్కడ తనకి మంచి పేరుండేది'.

అతడి మాట పూర్తికాకుండానే సుందరం అందుకుని 'చలపతి' అన్న పేరు బాగానే వుందే. ఇంతకంటే మంచిపేరు మరోటుండేదా?' అన్నాడు.

ఆ మాట విన్న శంకర్రావు చీమలపుట్టలా ముఖం పెట్టి 'నువ్వు జోకేశాననుకుంటున్నావ్ గాని ఇక్కడెవరికీ నవ్వు రాలేదు. నోర్మూసుకుని విను. మన చలపతి వర్క్‌లోనే కాదు, అన్నింట్లోనూ ఎఫిసియంటే. అసలు అతడికి అన్ని అవకాశాలూ అలా కలిసొచ్చేవి. అదతడి గ్రహబలం కాబోలు' అన్నాడు.

ఆమాటకి 'ఏంటోయ్ అంత కలిసొచ్చిన అదృష్టం' అడిగాడు సుందరం.

'మేమిద్దరం విజయనగరంలో పని చేస్తున్నప్పుడు వీళ్ళ కుర్రాడు టెన్త్‌క్లాస్ చదివేవాడు' అంటూ ఆగాడు శంకర్రావు.

ఆ మాటకి సుందరం 'అదేనా కలిసొచ్చిన అదృష్టం? అలాగైతే మా కుర్రాడూ ఈ సంవత్సరం టెన్త్ చదువుతున్నాడు. నాకే అదృష్టమూ పట్టలేదే. పైగా ట్యూషన్‌లకనీ, పుస్తకాలకనీ, వాటికనీ, వీటికనీ వేలకు వేలు దండేస్తున్నారు'

'అదే మనకీ, చలపతికీ వున్న తేడా?' అన్నాడు శంకర్రావు.

అలాఅని ఆగిపోయిన శంకర్రావుతో సుందరం 'నీ కసలు పోస్టుమేన్ ఉద్యోగం ఇచ్చి మన డిపార్ట్‌మెంట్ వాళ్ళు పెద్ద తప్పు చేశార్రా. నీకు పత్రికాఫీసులో ఎడిటర్ ఉద్యోగం ఇవ్వాల్సింది' అన్నాడు.

'ఎందుకట' కుతూహలంగా అడిగాడు శంకర్రావు.

'ఎందుకేమిటి? సరిగ్గా మంచి విషయం వచ్చేసరికి 'సశేషం' అని ఆపేసిన సీరియల్‌లా ఆపేస్తావు కదా? అందుకని' అన్నాడు.

'చాల్లే సంతోషించాను గానీ విను. ఆ టైంలో మన చలపతి బీటు టీచర్స్ కాలనీలో వుండేది. మనవాడు ఎక్కడున్నా నోటి మంచితనం వున్నవాడాయె. దాంతో పైసా ఖర్చు లేకుండా అన్ని సబ్జెక్టుల ట్యూషన్‌లూ ఫ్రీగా లాగించేశాడు' అన్నాడు.

ఆ మాట విన్న సుందరం 'మన చలపతి ఘటికుడేనన్న మాట' అన్నాడు చలపతి వైపు చూస్తూ. ఆ మాటకి చలపతి చిరునవ్వు నవ్వాడు.

అంతలోనే శంకర్రావు అందుకుని 'ఆగాగు. అక్కడితో సంతోషించకు. మనవాడి వీరగాథలు వీనుల విందుగా విను. ఆ కాలనీలోనే మనవాడి అదృష్టం కొలదీ ఇద్దరు మ్యూజిక్ కాలేజీ లెక్చరర్‌లు అద్దెకుండేవారు. వాళ్లని మంచి చేసుకుని కూతుర్ని మ్యూజిక్ డిప్లమో చేయించేశాడు. ఇప్పుడాపిల్ల కచేరీలిచ్చే స్థాయికొచ్చింది' అన్నాడు. ఆ మాట వినగానే చలపతే అందుకుని శంకర్రావుతో ఇలా అన్నాడు.

'నీకు ట్రాన్స్‌ఫర్ అయాక నా బీటు కాలేజీ ఏరియాకి మారింది' అన్నాడు -'మిగిలిన విషయాలు అర్థం చేసుకో' అన్నట్టు.

**'చాల్లే సంతోషించాను గానీ విను. ఆ టైంలో మన చలపతి బీటు టీచర్స్ కాలనీలో వుండేది. మనవాడు ఎక్కడున్నా నోటి మంచితనం వున్నవాడాయె. దాంతో పైసా ఖర్చు లేకుండా అన్ని సబ్జెక్టుల ట్యూషన్‌లూ ఫ్రీగా లాగించేశాడు'**

'అందుకే నిన్ను "సిరిపతి" అని ముద్దుగా పిలుస్తాం. అసలు నీ ఫాస్టేవర్క్ చూసి నిన్ను అలాంటి ప్రాంతానికి వేస్తారు. ఏ ప్రాంతమైనా నీకు అనుకూలంగా మారుతుంది. ఆఫ్‌కోర్స్ అది నీ నోటి మంచితనమనుకో. ఇక్కడికి వచ్చాక మన మాష్టారికి తెలియక ఆ మారుమూల బీటు ఇచ్చారు కానీ... నీకది తగింది కాదు' అన్నాడు.

ఆ మాటకి చలపతి మౌనం వహించాడు. బయటికన లేదు కానీ అతడి మనసులో ఆ బీటు తనకి పడినందుకు ఆనందంగానే వుంది. ఇది వరకు తన పిల్లల చదువులూ అవసరాలూ ఒడ్డెక్కితే ఇప్పుడు తన భార్యకింద చేసే ఖర్చు తప్పిందనే సంతోషంవుంది.

★ ★ ★

పనిచేస్తూనే అలా కుర్చీలో వెనక్కి వాలిపోయిన చలపతి చుట్టూ మూగారు మిగిలిన పోస్టుమేన్ లంతా.

చల్లని నీరు ముఖంమీద చిలకరించారు. ఉత్తరాలనే విసనకర్రలుగా చేసి విసిరారు. నీళ్లు తాగించారు. నీటితో తేలికగా ముఖం కడిగారు. ఇలా రకరకాల ఉపచారాలు చేశాక నెమ్మదిగా చలపతికి తెలివొచ్చింది. కానీ పూర్తిగా తేరుకోడానికింకో పావుగంట పట్టింది. అతడు కాస్త మాట్లాడే స్థితికొచ్చాక అడిగారొకరు 'ఎలావుంది?' అని.

దానికతడు మాట్లాడకుండా చెయ్యెత్తి చూపించి బుర్ర ఊపాడు 'బాగుంది' అనే అర్థం వచ్చేటట్టు.

అది చూసిన శంకర్రావు అడిగాడు 'ఎప్పుడూ లేనిది ఇలా సొమ్మసిల్లి పోయావేంటి' అని.

దానికి చలపతి నెమ్మదిగా గొణుగుతూ 'అంతా నా ఖర్మ' అన్నాడు నెమ్మదిగా నుదుటిమీద చేతితో కొట్టుకుంటూ.

'అసలేం జరిగింది చలపతీ!' మరొక పోస్టుమేన్ ఆతృత ఆపుకోలేక అడిగాడు. అక్కడున్న అందరి మనసుల్లోనూ అదే ఆతృత. అదే ప్రశ్న వుంది.

వారి ఆతృతని ఇంకా పెంచడం ఇష్టంలేక పోవడంతో లేని ఓపిక తెచ్చుకున్నాడు చలపతి. వారడిగిన ప్రశ్నలకు జవాబుగా 'మొన్న శంకర్రావు చెప్పినట్టు నేను ఏ బీటుకెళ్లినా ఏదోరకంగా లాభం పొందుతాను. బజారు బీటుకెళితే నెలవెచ్చాలు కొంత తగ్గింపు ధరల్లో పొందుతాను. టీచర్ల కాలనీలో బీట్ అయితే పిల్లల చదువులు, డాక్టర్లు ఉన్న ఏరియాలో అయితే వైద్యం, ఇలా ఎక్కడ ఏది అవకాశముంటే దాన్ని నా మాట మంచితనంతో లాభం పొందేవాణ్ని' అంటూ ఆగాడు.

ఆ మాటకి చలపతితో సుందరం 'సర్లే! అన్ని రోజులూ మనవవుతాయా? అలాటి దానికి ఇలా విరుచుకు పడిపోవాలా? అడిగాడు.

ఆ మాటకి చలపతి 'నేను పడిపోవడానికి కారణం ఇక్కడ లాభం లేదని కాదు' అన్నాడు.

'మరి? ఈ మధ్య ఏమైనా అనారోగ్యానికి గురయ్యావా?' మళ్లీ సుందరమే అడిగాడు.

'నాకు అనారోగ్యం లేదూ ఏపాడూ లేదు. అసలింత వరకూ నా సొంతానికి ఒక్క మాత్ర కూడా వాడి ఎరుగను. ఇదిగో ఇప్పుడు ఈ దిక్కుమాలిన బీటులో పడ్డాను. నా ప్రాణం మీదకొచ్చింది' బాధగా అన్నాడు.

'ఇంతకీ ఆ బీటులో అంత బాధ పడవలసిన విషయమేంటి?' ఆతృత ఆపుకోలేక అడిగాడు శంకర్రావు.

'బాధ ఏమిటీ? అని నెమ్మదిగా అడుగుతావా? ఇదిగో ఈ ఉత్తరాలు చూడు' అంటూ విసురుగా అక్కడున్న ఉత్తరాల కట్టని ఒక్కసారిగా అతడి ముందుకు తోశాడు.

'బాగుందోయ్ చలపతీ నీవరుస. ఉద్యోగం వచ్చిన దగ్గర్నుంచీ ఈ ఉత్తరాల మధ్యే మన బతుకు. అలాటిది కొత్తగా "ఉత్తరాలు చూడు" అంటూ జబ్బుగురించి అడిగితే ఉత్తరాల కట్టలు చూపిస్తావేంటీ?' అన్నాడు చిరాగ్గా.

అదేస్థాయిలో స్పందించిన చలపతి 'ఉత్తరాలు చూడూ అంటే ఎన్నున్నాయో చూడమని' అన్నాడు. నీరసంగా ధ్వనించిందా మాట.

అప్పుడు చూశారు అక్కడున్న పోస్టుమేన్‌లంతా అటువైపు. అందులో మామూలు ఉత్తరాలకంటే పెద్ద



'అందుకే స్థలాభోగం, శిలాభోగం అన్నారు. ఏ స్థలమహాత్యం ఎలాటిదో. ఇన్నాళ్ళూ తను పని చేసిన స్థలంలో సుఖాలు అనుభవిస్తే ఇప్పుడు కష్టాలనుభవించ వలసి వస్తోంది. ఏం చేస్తాం? అంతా ఆ భగవంతుడి లీల'

పెద్ద బరువు కవర్లే ఎక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా, ఆ ఆఫీసులో వున్న మిగిలిన ఏడుగురి దగ్గర కలిసి ఎన్నున్నాయో ఇతడొక్కడి దగ్గరా ఇంచుమించు అన్నున్నాయ్. అసలు వాటిని తీసుకెళ్ళడానికి అతడి దగ్గరున్న సంచీ చాలదు. ఒక పెద్ద పోస్టల్ బ్యాగ్గే ఉండాలనిపిస్తుంది. ఆ వరస చూసిన సుందరం అడిగాడు.

'ఏంటీ? ఇవన్నీ నీ బీట్‌లో పంచాల్సినవేనా...?'

'ఆ... ఇవాళొక్కరోజే కాదు. ప్రతిరోజూ ఇదే గాడిద మోత' అన్నాడు బాధగా చలపతి.

'ఆ మారుమూల బీట్‌కి అన్ని ఉత్తరాలెలా వస్తున్నాయ్? ఇప్పుడిప్పుడే డెవలప్ అవుతున్న ఆ కాలనీకి అన్ని ఉత్తరాలెందుకొస్తున్నాయబ్బా'. మనసులోని సందేహాన్ని జనాంతికంగా అడిగాడు శంకర్రావు.

ఆ మాటకి చలపతి 'నా ఖర్మకొద్దీ. ఈ ఊరిలోని రచయితలందరూ అక్కడ కాలనీ కట్టుకున్నారు. అందుకూ' అన్నాడు కసిగా.

'ఏంటీ రచయితలంతా ఒక కాలనీ కట్టుకున్నారా? అక్కడున్న పోస్టుమేన్‌లంతా కోరస్‌గా అన్నారు ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

'మరేమిటనుకున్నారు?' బాధగా అన్నాడు చలపతి.

ఆమాటకి సుందరం 'టీచర్లంతా కాలనీ కట్టుకోవడం విన్నాం. ఒకే ఆఫీస్ వాళ్లంతా ఒకచోట కాలనీ కట్టుకోడం విన్నాం. వృత్తి పనివారలు, ఒకే వ్యాసంగంలో వున్న వాళ్ళు కాలనీ కట్టుకోడం విన్నాం. కానీ ఇలా రచయితలంతా కాలనీ కట్టుకోడం ఎప్పుడూ వినలేదే' అన్నాడు ఆశ్చర్యంగా.

ఆమాట విన్న చలపతి 'వినడమేమిటి? ఇక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నాను. మొదట్లో ఇలాటి కాలనీ ఒకటుందని తెలిసి ఆనందించాను. ఎందుకంటే, మా ఆవిడకి పుస్తకాల పిచ్చి ఎక్కువ. ఎంత పిచ్చంటే నా జీతంలో కనీసం మూడు నాలుగు వందలు ఆమె పత్రికలకే ఖర్చవుతుంది. అందువల్ల ఆ రచయితల రచనలు ప్రచురించబడితే పాత కాంప్లిమెంటరీ కాపీలు, ఇతర రచనలు, దాంతోపాటు వాళ్ళు చదవడానికి కొన్న పత్రికలు అడిగి ఇంటికి పట్టుకెళ్లవచ్చని, తద్వారా నా భార్యకి పత్రికలు కొనే ఖర్చు తప్పుతుందని ఊహించాను. సరదాపడ్డాను. కానీ ఇప్పటి వరకూ వాళ్ల రచనల్లో ఎన్ని ప్రచురించబడ్డాయో తెలీదుగాని, రోజురోజు ఇలా బస్తాలకి బస్తాల రచనలు పత్రికలనుంచి తిరిగి వస్తూంటే మోసుకెళ్లి వాళ్లకప్పగించలేక ఛస్తున్నాను. ఈ బాధ భరించే సరికే ప్రాణాలు కడదేరిపోతున్నాయి. దానికి తోడు తిరిగొచ్చిన ఆ రచనల్ని వారికిస్తే ఆ రచయిత నన్ను చూసే చూపుల్ని తట్టుకోవడం మరింత బాధగా వుంది. అసలు మన సమాజంలో మనకున్న గౌరవం ఒక ప్రత్యేకమైంది. ఎలాంటివారి కళ్లయినా మనకోసం వెతుకులాడతాయి. ఎంత వేగిరం పోస్టుమేన్ వస్తాడా? ఉత్తరం తెస్తాడా అని ఎదురు చూస్తారు. అలాటిది ఆ కాలనీ వాళ్ళు మాత్రం నన్ను ఒక శతృవులా భావిస్తున్నారు. ఎందుకంటే నేను కనబడే సరికి ఏ రచన ఎవరిది తిరిగి తీసుకొచ్చానోనని నన్ను క్రూరంగా చూస్తున్నారు. అయినా అదేంవెర్రో వాళ్లకు నా ప్రాణాలు తియ్యడానికి కాకపోతే రచయితలంతా ఒక దగ్గర కాలనీ కట్టుకోవడమేమిటో? ఇది వరకు నా డ్యూటీ రెండుమూడు గంటల్లో పూర్తి చేసి ఇంటికి పోయేవాణ్ని. కానీ ఇప్పుడు నేనింటికి చేరే సరికి ఏమవుతుందో ఆ భగవంతుడికే తెలియాలి. ఇంటికెళ్ళేసరికి ఒంట్లో ఓపికంతా పూర్తిగా హరించుకుపోతూంది' అన్నాడు బాధగా.

ఆ మాటలు విన్న మిగిలిన పోస్టుమేన్‌లంతా మరేమీ మాట్లాడకుండా ఊరుకున్నారు. ఇంకాఏమైనా అంటే ఆ బీటు తమ పీకకెక్కడ చుట్టుకుంటుందోననే భయంతో ఒక్కొక్కరే నెమ్మదిగా అక్కడ్నుంచి జారుకుని ఎవరి జాగాలో వారు చేరారు.

నెమ్మదిగా ఓపిక తెచ్చుకున్న చలపతి మాత్రం 'అందుకే స్థలాభోగం, శిలాభోగం అన్నారు. ఏ స్థలమహాత్యం ఎలాటిదో. ఇన్నాళ్ళూ తను పని చేసిన స్థలంలో సుఖాలు అనుభవిస్తే ఇప్పుడు కష్టాలనుభవించ వలసి వస్తోంది. ఏం చేస్తాం? అంతా ఆ భగవంతుడి లీల' అనుకున్నాడు.

అంతలోనే రచయితల వైపునుంచి ఆలోచిస్తూ 'తనకీ స్థలం ఎప్పటికైనా మారుతుంది. కానీ స్థిరంగా ఇళ్ళు కట్టుకున్న ఆ రచయితలు కట్టుకున్న స్థలం మంచిది కాదేమో. అందుకే రచనలు తిరిగొచ్చేస్తున్నాయి పాపం' అనుకున్నాడు జాలిగా.

★